క్లుప్తంగా

ఉత్సాహంగా బండలాగుడు పోటీలు



బండలాగుడు పోటీలను ప్రారంభిస్తున్న బంగారు మునిరెడ్డి

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక ముక్తిరామలింగేశ్వరస్వామి ఆలయంలో స్వామివారి బ్రహ్మోత్సవాల సందర్భంగా గురువారం సాయంత్రం బండలాగుడు పోటీలను నిర్వహించారు. రాష్ట్రంలోని పలు ప్రాంతాలకు చెందిన 10 జతల ఎద్దు ఈ పోటీలలో పాల్గొన్నాయి. బండలాగుడు పోటీలను మున్సిపల్ వైస్ చైర్మన్ బంగారు మునిరెడ్డి ప్రారంభించారు. పోటీలను పట్టణంతో పాటు పరిసర గ్రామాలకు చెందిన రైతులు, ప్రజలు ఆసక్తిగా తిలకించారు. ఆలయ కమిటీ చైర్మన్ పల్లెటి శంకర్‌రెడ్డి, సభ్యులు, భక్తులు, ఆలయ నిర్వాహకులు పాల్గొన్నారు.

భూసార పరీక్షపై శిక్షణ

బి.కోడూరు : మండలంలోని బి.కోడూరు రైతు భరోసా కేంద్రంలో గురువారం కేంద్ర సిబ్బందికి భూసార పరీక్షలపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడీఏ మురళీధర్‌రెడ్డి మాట్లాడుతూ భూసార పరీక్షల్లో మట్టిన మూనాలను సేకరించే పద్ధతులు, తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. మండల వ్యవసాయాధికారి టి.కౌశిక మాట్లాడుతూ ఏప్రిల్ రెండవ వారాన్ని మట్టిపరీక్ష శిక్షణ వారంగా పరిగణించడం జరిగిందని, ప్రతి రైతుభరోసా కేంద్ర సిబ్బంది తమ పరిధిలోని రైతుల వ్యవసాయ భూముల్లో మట్టినమూనాలను సేకరించి జిల్లా మట్టిపరీక్షా కేంద్రానికి పంపాలని తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ ఎస్.దావీదు, రైతుభరోసా కేంద్ర సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

మట్టి నమూనా సేకరణపై శిక్షణ

కాశినాయన : మండలంలోని నరసాపురం రైతుభరోసా కేంద్రంలో గురువారం భూసార పరీక్షలకు మట్టి నమూనాలు సేకరించే పద్ధతిపై గ్రామ వ్యవసాయ సహాయకులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయాధికారి జాకీర్‌షరీఫ్ ప్రయోగశాల పరీక్ష ఫలితాల ఆధారంగా చేయవలసిన సిఫార్సులు, సమస్యాత్మక నేలలకు తగు సూచనలు గురించి వివరించారు. మట్టి నమూనాలను సేకరించి పరీక్షలకు పంపాలని, వచ్చిన రిపోర్టుల ఆధారంగా భూమికి ఏయే పోషకాలు ఎంత మోతాదులో వేయాలో తెలుస్తుందని తెలిపారు. రైతులు మట్టి నమూనా పరీక్షను చేయించుని రిపోర్టుల ఆధారంగా ఎరువులను వాడాలని తెలిపారు. కార్యక్రమంలో భాగంగా గ్రామ వ్యవసాయ సహాయకులతో కొన్ని మట్టి నమూనాలు సేకరించారు. కార్యక్రమంలో వీపీఏలు, రైతులు పాల్గొన్నారు.

డీఎస్సీ-98 ఉద్యోగాలను పూర్తిగా భర్తీ చేయాలి

ప్రొద్దుటూరు : రాష్ట్ర ప్రభుత్వం అర్హులైన 1998 డీఎస్సీ అభ్యర్థులందరికీ న్యాయం చేయాలని డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీరనాల శివకుమార్ తెలిపారు. ఆయన గురువారం విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ఖాళీగా ఉన్న 4,534 టీచర్ పోస్టులను డీఎస్సీ 1998 అభ్యర్థులతో భర్తీ చేస్తామని ప్రకటించారని తెలిపారు. వాటిలో కేవలం 472 పోస్టులు మాత్రమే భర్తీ చేసి కోత విధించారన్నారు. కటాఫ్ పద్ధతిలో ఎంపిక వల్ల, రోస్టర్ ఆఫ్ రిజర్వేషన్ పాటించకపోవడం వల్ల అభ్యర్థులు ఉద్యోగాలకు దూరమయ్యారన్నారు. సమావేశంలో డీవైఎఫ్ఐ పట్టణాధ్యక్షుడు వెంకటేశ్, విశ్వనాథ్ పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఆప్కాబ్ చైర్‌పర్సన్ మల్లేల ఝాన్సీరాణి

ప్రొద్దుటూరు : మండల పరిధిలోని లింగాపురం ఆటోనగర్ వద్ద ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఆప్కాబ్ చైర్‌పర్సన్ మల్లేల ఝాన్సీరాణి గురువారం ప్రారంభించారు. తల్లం మురళీమోహన్ స్మార్థకార్థం ఆయన సతీమణి శంకుతలమ్మ ఈ చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో నవీన్ గంటసాల పవన్‌కుమార్, తొండూరు రవీంద్రనాథ్‌రెడ్డి, జగదీశ్వరరెడ్డి, సాయి, రాజుల గోవర్ధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యంపై అవగాహన



విద్యార్థినులకు పుస్తకాలను అందజేస్తున్న ట్రస్టు ప్రతినిధులు

బద్వేలు : మదర్‌థెరిసా ఫౌండేషన్, ఫౌండేషన్ ఫర్ చిల్డ్రన్ ఇన్ నీడ్ సహకారంతో బ్రిస్‌్రబియాన్ ఆసుపత్రి సిబ్బంది గురువారం బి.కోడూరు మండలంలోని కస్తూర్బాగాంధీ పాఠశాల విద్యార్థులకు ఆరోగ్యంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఫౌండేషన్ ప్రతినిధులు చిత్తాప్రజ్వలరెడ్డి, వైద్యురాలు డాక్టర్ మౌనికరెడ్డిలు విద్యార్థులు ఆరోగ్యంపై తప్పక అవగాహన కలిగి ఉండాలన్నారు. చిత్తాథామస్‌రెడ్డి, డాక్టర్ గీతాఏరువలు శారీరక రుతుక్రమం, పీరియడ్స్‌పై రూపొందించిన కామిక్ పుస్తకాలను విద్యార్థినీలకు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, ఏఎన్ఎంలు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ చేసిన అభివృద్ధి ఏంటో చెప్పగలరా?

- వచ్చే ఎన్నికల్లో టీడీపీ అడ్రస్ గల్లంతు ఖాయం!
- ప్రజల్లో వస్తున్న ఆదరణ చూసి ఓర్వలేకే మాపై విమర్శలు
- గడప గడపకు మన ప్రభుత్వంలో ఎమ్మెల్యే రఘురామిరెడ్డి



టీడీపీ సానుభూతిపరురాలి కుటుంబానికి జరిగిన లబ్ధిని వివరిస్తున్న ఎమ్మెల్యే శెట్టిపల్లె

ఖాజీపేట : టీడీపీ పాలనలో చేసిన మంచి గురించి ప్రజలకు వివరించే ధైర్యం ఉందా అంటూ టీడీపీ నాయకులకు ఎమ్మెల్యే రఘురామిరెడి ప్రశ్నించారు. మిడుతూరు పంచాయతీ పరిధిలో రెండవ రోజు గడప గడపకు మన ప్రభుత్వంలో మిడుతూరు, ఎస్సీ కాలనీ, సన్నపల్లె పంచాయతీల్లో ఎమ్మెల్యే ప్రతి ఇంటికి వెళ్లారు. సంక్షేమ ఫలాల లబ్ధిని వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీడీపీ నాయకులు వైఎస్సార్‌సీపీపై విమర్శలు చేసేందుకు కూడా అనర్హులన్నారు. గ్రామాల్లోకి వెళ్లి చూస్తే మేం చేసిన అభివృద్ధి వారికి కనిపిస్తుందన్నారు. గ్రామాల్లో తిరుగుతుంటే ప్రజల నుంచి అపూర్వ మద్దతు లభిస్తోందని తెలిపారు. మాకు వస్తున్న మద్దతు చూడలేక మాపై చౌకబారు విమర్శలు టీడీపీ వారు చేస్తున్నారని చెప్పారు. ఇలాగే ఉంటే వచ్చే ఎన్నికల్లో టీడీపీ అడ్రస్ గల్లంతు కావడం ఖాయం అని జోస్యం పలికారు.

టీడీపీ నేత బంధువు కుటుంబానికి రూ. 5,63,242 లబ్ధి

మిడుతూరు గ్రామంలో టీడీపీ నాయకుడి బంధువు ఇంటికి రూ 5,63,242 లబ్ధి చేకూరిందన్నారు. వచ్చిన లబ్ధి గురించి ఓబిగాని రామలక్షుమ్మను అడిగితే ప్రభుత్వం నుంచి జరిగిన లబ్ధి నిజమేనని సమాధానమిచ్చారు. అయినా వారు వారి ఇంటికి ఇదేం ఖర్మరా బాబు అంటూ స్టిక్కర్ అంటించుకున్నారని తెలిపారు. మాకు తెలియకుండా స్టిక్కర్ అంటించారని ఆమె చెప్పారు. కులం, మతం, పార్టీలను చూడకుండా అందరికీ సంక్షేమ ఫలాలను ప్రభుత్వం అందిస్తోందని తెలియజేయడానికి ఇదే ఉదహారణ అని ఎమ్మెల్యే తెలియజేశారు.

పుష్పగిరి తిరునాలకు ఆహ్వానం

పుష్పగిరి చెన్నకేశవ స్వామి తిరునాల మహోత్సవానికి రావాలసిందిగా ఎమ్మెల్యేని ఆలయ చైర్మన్ సుబ్బారెడ్డి, ఆలయ పూజారి, కమిటీ సభ్యులు కోరారు. అందుకు ఆయన సుముఖత వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఏపీఐఐసీ డైరెక్టర్ గంగాధర్‌రెడ్డి, జిల్లా పరిషత్ కో–ఆప్షన్ సభ్యుడు అచ్చుకట్ల కరీముల్లా, అగ్రహారం సొసైటీ అధ్యక్షుడు రాఘవరెడ్డి, మండల కన్వీనర్ మురళీమోహన్‌రెడ్డి, ఎంపీటీసీ ప్రశాంతి, సర్పంచ్‌లు తప్పట మేరి, తుమ్మలూరు సుబ్బమ్మ మాజీ సర్పంచ్ సుదర్శనరెడ్డితో పాటు పలువురు వైఎస్సార్‌సీపీ మండల నాయకులు పాల్గొన్నారు.

మరో ఏడాది పాలనలో మరింత లబ్ధి

ఎమ్మెల్యే డాక్టర్ సుధ



బుచ్చనపల్లెలో పథకాల లబ్ధిని ప్రజలకు వివరిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సుధ

గోపవరం : వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో మరో ఏడాది పాలనతో మరింత లబ్ధి పొందవచ్చని ఎమ్మెల్యే డాక్టర్ సుధ తెలిపారు. గురువారం మండలంలోని టీ.సండ్రపల్లె సచివాలయం పరిధిలోని బుచ్చనపల్లె, రామిరెడ్డిపాలెం గ్రామాల్లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్న ఆమె ఇంటింటికీ వెళ్ళి ప్రజా సమస్యలను తెలుసుకుంటూ ఇప్పటి వరకు వివిధ సంక్షేమ పథకాల ద్వారా కుటుంబం ఏ మేరకు లబ్ధి పొందిందో వారికి వివరిస్తూ బుక్‌లెట్‌ను అందజేశారు. ఇంకా అర్హత ఉండి పింఛన్, సంక్షేమ పథకాలు రాకుండా ఎవరైనా ఉన్నారా అని ఆరాతీయగా అందరికీ పథకాలు వస్తున్నాయన్నారు. ఏదైనా సమస్య ఉంటే స్థానిక సచివాలయంలో ఫిర్యాదు చేస్తే ఒకటి, రెండు రోజుల్లోనే పరిష్కరిస్తారని ఆమె తెలిపారు. గ్రామీణ ప్రజలకు మెరుగైన వైద్యం కోసం ప్రవేశపెట్టిన ఫ్యామిలీ డాక్టర్ విధానాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

జగనన్నే మా భవిష్యత్తుకు మంచి ఆదరణ

జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమానికి ప్రజల నుంచి మంచి ఆదరణ లభిస్తుందని ఎమ్మెల్యే తెలిపారు. బుచ్చనపల్లెలో మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. గత ప్రభుత్వ పాలనకు, వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ పాలనకు తేడాపై ప్రజలను అడుగగా జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో సంతోషంగా ఉన్నామని ప్రజలు ఎమ్మెల్యేకు వివరించారు. కార్యక్రమంలో మండల వైఎస్సార్‌సీపీ కన్వీనర్ గోపవరం మల్లికార్జునరెడ్డి, సింగిల్‌విండో అధ్యక్షుడు వేణుగోపాల్‌రెడ్డి, సర్పంచ్‌లు సరిత, నాగేంద్ర, పంచాయతీరాజ్ ఈఈ నాగరాజు, ఎంపీడీఓ హరినారాయణ, పార్టీ నాయకులు శ్రీకాంత్, అన్నిశాఖల అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

వేగంగా ఈద్గా అభివృద్ధి పనులు





పనుల నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే రాచమల్లు (ఫైల్), ఈద్గాకు ప్రహరీ నిర్మిస్తున్న దృశ్యం

రూ.60లక్షలు మున్సిపల్ నిధులు కేటాయింపు

ప్రొద్దుటూరు : పట్టణ పరిధిలోని కొర్రపాడు రోడ్డులో ఉన్న ఈద్గా మైదానం అభివృద్ధి పనులు వేగంగా జరుగుతున్నాయి. ఇందు కోసం మున్సిపల్ జనరల్ ఫండ్ నుంచి రూ.60 లక్షలు నిధులు కేటాయించారు. మున్సిపాలిటీకి సంబంధించి ముస్లిం మైనారిటీల జనాభాను దృష్టిలో ఉంచుకుని ఈ పనులు చేపడుతున్నారు. పట్టణానికంతటికీ ప్రముఖంగా ఈ ఒక్క మైదానం మాత్రమే ఉంది. జనాభాకు తగిన విధంగా లేకపోవడంతో రంజాన్, బక్రీద్‌ల సందర్భంగా ప్రార్థనలు చేసుకునేందుకు మైనారిటీలు ఇబ్బందులు పడేవారు. ఈ సమస్యను దృష్టిలో ఉంచుకుని ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి సూచన మేరకు ఈ నిధులు కేటాయించారు. ఇందులో భాగంగా ఈద్గాలో మండల చపట నిర్మాణం, వజు చేసుకునేందుకు నీటి సౌకర్యం, ప్రహరీ నిర్మాణం, ఆర్చీ నిర్మాణాలు చేపట్టాల్సి ఉంది. ఎక్కువ శాతం పనులు రంజాన్ పండుగ నాటికి చేసేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. ఈ పనుల ప్రారంభానికి ఈ ఏడాది ఫిబ్రవరి 6న ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ భీమునిపల్లి లక్ష్మీదేవి, వైస్ చైర్మన్ పాతకోట బంగారు మునిరెడ్డి, ముస్లిం మైనారిటీ మత పెద్దలు, కౌన్సిలర్లు భూమిపూజ చేశారు.

ఈద్గాలో వసతులు కల్పించాలని వినతి



మున్సిపల్ కమిషనర్ వెంకటరమణయ్యకు వినతి పత్రమిస్తున్న అంజుమన్ అహలే ఇస్లాం కమిటీ సభ్యులు

ప్రొద్దుటూరు : స్థానిక కొర్రపాడు రోడ్డులోని ఈద్గా మైదానంలో వసతులు కల్పించాలని మున్సిపల్ కమిషనర్ వెంకటరమణయ్య, మున్సిపల్ వైస్ చైర్మన్ పాతకోట బంగారు మునిరెడ్డికి అంజుమన్ అహలే ఇస్లాం కమిటీ సభ్యులు గురువారం వినతి పత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ఏడాది రంజాన్, బక్రీద్ పండుగల రోజున మున్సిపాలిటీ వారు ఈద్గాలో షామియానా, మంచినీరు కల్పిస్తున్నారని తెలిపారు. అలాగే ఈ ఏడాది కూడా రంజన్ పర్వదినాన్ని పురస్కరించుకుని ఈద్గా మైదానంలో షామియానా, మంచినీరు, కూలర్లు, పారిశుధ్య వసతులు కల్పించాలని వారు విన్నవించారు. అంజుమన్ అహలే ఇస్లాం కమిటీ ప్రెసిడెంట్ బొల్లవరం బాషా, జాయింట్ సెక్రటరీ బాబా, కౌన్సిలర్ ఖలీల్ బాషా, వైఎస్సార్‌సీపీ 22వ వార్డు ఇన్‌చార్జి హిదాయత్, 25వ వార్డు ఇన్‌చార్జి నూరి పాల్గొన్నారు.

నేటి నుంచి అగ్నిమాపక వారోత్సవాలు

ప్రొద్దుటూరు క్రైం : అగ్నిమాపక వారోత్సవాల ప్రారంభ కార్యక్రమాన్ని శుక్రవారం ఉదయం 10గంటలకు నిర్వహించనున్నట్లు అగ్నిమాపక అధికారి రఘునాథ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి తహశీల్దార్ నజీర్, సీఐ నారాయణయాదవ్ ముఖ్య అతిథులుగా హాజరవుతారన్నారు. ఈ నెల 14 నుంచి 20 వరకు అగ్నిమాపక వారోత్సవాలను నిర్వహిస్తామని చెప్పారు. ప్రతి రోజు అగ్నిప్రమాదాలపై విద్యార్థులతో పాటు అపార్ట్‌మెంట్లు, పెట్రోల్ బంకులు, హాస్పిటల్స్‌లో అవగాహన కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు ఆయన వివరించారు.

జగన్ ప్రభుత్వంలో మరింత ఆదరణ

బి.కోడూరు : మండలంలోని మున్నెల్లి పంచాయతీ పరిధిలోని రాజుపాలెం గ్రామంలో జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమాన్ని సింగిల్‌విండో అధ్యక్షుడు ఓ.ప్రభాకర్‌రెడ్డి ఉపసర్పంచ్ వెంకటరామిరెడ్డి, గృహసారథులు వెంకటరామిరెడ్డి, రమణారెడ్డి, సుబ్బరామిరెడ్డిలతో కలిసి నిర్వహించారు. ప్రతి ఇంటికి మా నమ్మకం నువ్వే జగన్ స్టిక్కర్లను అతికించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు కె.నారాయణరెడ్డి, సుబ్బారెడ్డి, చెన్నారెడ్డి, వెంకటసుబ్బారెడ్డి, వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

మట్టి నమూనా సేకరణలో జాగ్రత్తలు తీసుకోవాలి



అవగాహన కల్పిస్తున్న ఏడీఏ కృష్ణమూర్తి

చాపాడు : రైతుల నుంచి పంట పొలాల్లో మట్టి నమూనా సేకరణలు చేపట్టాలని, సేకరణ సమయంలో జాగ్రత్తలు పాటించాలని వ్యవసాయశాఖ మైదుకూరు డివిజన్ ఏడీఏ కృష్ణమూర్తి సూచించారు. గురువారం మండల పరిధిలోని పల్లవోలు ఆర్‌బీకేలో మండల వ్యవసాయాధికారి మ్యాగీ అధ్యక్షతన అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఏడీఏ మాట్లాడుతూ సిబ్బంది రైతుల పంట పొలాల్లో మట్టి నమూనాలను సేకరించి వాటిని పరీక్షలకు పంపాలన్నారు. మట్టి ఆరోగ్య పరీక్షలను చేయించిన తర్వాత వివరాలను రైతులకు తెలియజేయాలన్నారు. పరీక్షల అనంతరం అందుబాటులో ఉన్న పోషకాలకు అనుగుణంగా ఎరువుల వాడకాన్ని సూచించాలన్నారు. ప్రతి ఆర్‌బీకే పరిధిలో నిర్దేశించిన లక్ష్యాన్ని పూర్తి చేయాలని తెలిపారు. మట్టి నమూనా ఆవశ్యకత గురించి శాస్త్రవేత్తలు వివరించారు. సిబ్బందికి కొన్ని మట్టి నమూనాలను సేకరించే విధానంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డీఆర్సీ పీడీ విజయలక్ష్మి, ఏపీడీ పద్మలత, ఏఆర్సీ శాస్త్రవేత్త ప్రత్యూష, కేటీసీ ఏఓ శైలజ, వీఏఏలు, వీహెచ్ఏలు, ఎంపీఈఓలు పాల్గొన్నారు.

‘వాస్తవాలు తెలుసుకుని మాట్లాడాలి’

పోరుమామిళ్ల : ప్రజాసంఘాల నాయకులు వాస్తవాలు తెలుసుకుని మాట్లాడితే బాగుంటుందని గురువారం విలేకరుల సమావేశంలో రంగసముద్రం ఎంపీటీసీ కల్వకూరి రమణ తెలిపారు. రంగసముద్రం పొలం సర్వే నెంబరు 1094లో దళితుల భూమి కబ్జాదారులకు ఎంపీటీసీ కల్వకూరి రమణ సహకరించారనడం సరికాదన్నారు. బొజ్జ గురన్న, గురమ్మ ఆ స్థలం తమ దంటూ ప్రజాసంఘాల వారిని తప్పుదోవ పట్టించారన్నారు. రమణ ఆ భూమికి సంబంధించిన అసలు డాక్యుమెంట్స్‌ను చూపిస్తూ 1993లో కలసపాడుకు చెందిన రాధాకృష్ణారెడ్డి బొజ్జ రాముడు, బాలస్వామి, జైపాల్, బాలశౌరి దగ్గర కొనుగోలు చేసి 2008లో ఐత్రంపేటకు చెందిన విజయభాస్కర్‌రెడ్డికి, రామచంద్రారెడ్డికి అమ్మి రిజిస్ట్రేషన్ చేయించాడన్నారు. వారు ఆ స్థలాన్ని జయరామిరెడ్డి కుమారుడు రాజమోహన్‌రెడ్డికి అమ్మి రిజిస్ట్రేషన్ చేయించారని ఆ స్థలంలో రూము నిర్మించుకునేందుకు రాజమోహన్‌రెడ్డి పనులు మొదలు పెట్టడంతో గురన్న, గురమ్మలు అడ్డు తగిలారన్నారు. ఈ స్థలానికి సంబంధించిన అన్ని లింకు డాక్యుమెంట్లు, పక్కా రిజిస్ట్రేషన్ పత్రాలు అన్నీ ఉన్నాయన్నారు. నిజాలు పరిశీలించాలని రమణ కోరారు.

భూ సార పరీక్షలపై అవగాహన అవసరం



అవగాహన కల్పిస్తున్న ఏఓ శివశంకర్‌రెడ్డి

ప్రొద్దుటూరు : సాగు భూమిలోనే జనాభాకు సరిపడా పంట దిగుబడులను సాధించాలంటే భూసార పరీక్ష చేయడం అవసరమని మండల వ్యవసాయాధికారి శివశంకర్‌రెడ్డి తెలిపారు. మండలంలోని కొత్తపల్లె రైతు భరోసా కేంద్రంలో భూ సార పరీక్షల ప్రాముఖ్యతపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాగు పంటకు నేలలో తగు నిష్పత్తిలో పోషకాలు లేనప్పుడు భూసార పరీక్ష ద్వారా నేలలో ఏ పోషకాలు తగ్గాయో తెలుసుకోవచ్చన్నారు. ఆ పోషకాలు మాత్రమే నేలకు అందించడం వల్ల పంట మంచి దిగుబడిని అందించడమేగాక నేలకు అందించే పోషకాల ఖర్చును బాగా తగ్గించుకోవచ్చన్నారు. పంటపై పెట్టే పెట్టుబడి తగ్గడంతో పాటు మంచి దిగుబడులు పొందవచ్చని తెలిపారు. ఈ సమావేశంలో వీఏఏలు పాల్గొన్నారు.

ఘనంగా వసంతోత్సవం



రంగులు, నీళ్లు చల్లుకుంటున్న యువకులు

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక రామేశ్వరంలోని శ్రీ ముక్తిరామలింగేశ్వర స్వామి ఆలయంలో స్వామివారి బ్రహ్మోత్సవాలలో భాగంగా గురువారం ఘనంగా వసంతోత్సవాన్ని నిర్వహించారు. తెల్లవారుజామున సైకత లింగానికి, రాజరాజేశ్వరి అమ్మవారికి, చండీ మాతకు, ఆదిశంకరాచార్యులు ప్రతిష్ఠించిన శ్రీ చక్రానికి, ఉత్సవ మూర్తులకు విశేష అభిషేకాలు, అర్చనలు చేశారు. గంగా రాజరాజేశ్వరి సమేత ముక్తిరామలింగేశ్వర స్వామి ఉత్సవ మూర్తులను ప్రత్యేకంగా అలంకరించి వాహనంపై కొలువు దీర్చి పురవీధుల్లో ఘనంగా వసంతోత్సవాన్ని నిర్వహించారు. భక్తులు రంగులు రంగులు చల్లుకుంటూ ఆనందోత్సాహాలతో వసంతోత్సవంలో పాల్గొన్నారు. కార్యక్రమానంతరం భక్తులకు తీర్థప్రసాద వినియోగం జరిగింది.

పాడి పరిశ్రమ అభివృద్ధికి కృషి చేయాలి



దేవరాజుపల్లెలో పాడిపరిశ్రమను పరిశీలిస్తున్న డీఆర్‌డీఏ పీడీ ఆనంద నాయక్

కమలాపురం : వ్యవసాయ రంగం తర్వాత రెండో స్థానంలో ఉన్న పాడి పరిశ్రమ అభివృద్ధికి వెలుగు సిబ్బంది కృషి చేయాలని డీఆర్‌డీఏ పీడీ ఆనంద నాయక్ తెలిపారు. గురువారం స్థానిక వెలుగు కార్యాలయంలో నిర్వహించిన వీఓఏల రివ్యూ సమావేశాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. సమావేశంలో చర్చిస్తున్న హౌసింగ్, లైవ్‌స్టాక్, లక్‌పతి దీదీ, జగనన్న తోడు, ఎంబీకే, ఎస్‌హెచ్‌జీ గ్రేడింగ్, ఆడిటింగ్ తదితర అంశాలపై జరిగిన రివ్యూను పరిశీలించారు. ముఖ్యంగా హౌసింగ్‌పై సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఫోకస్ చేశారని, డ్వాక్రా సంఘాల్లో ఉన్న ప్రతి సభ్యురాలికి రూ.30 వేలు రుణం మంజూరు చేయించి జగనన్న హౌసింగ్ కాలనీల్లో నిర్మిస్తున్న ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేసి పూర్తి చేసే విధంగా చూడాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. అలాగే మండలంలో మంజూరైన లైవ్ స్టాక్ యూనిట్ల గురించి ఆరా తీశారు. ప్రతి యూనిట్ గ్రౌండింగ్ చేయాలన్నారు. అనంతరం దేవరాజుపల్లెలో లైవ్ స్టాక్ యూనిట్‌ను పరిశీలించి లబ్ధిదారులతో మాట్లాడారు. మీకు ఏ సమస్య ఉన్నా తన దృష్టికి తీసుకువస్తే వాటిని పరిష్కరిస్తానన్నారు. పాడి పరిశ్రమ ద్వారా అధిక ఆదాయం గడించవచ్చని, బాగా అభివృద్ధి చేసుకోవాలని లబ్ధిదారులకు సూచించారు. రుణాలు పొందిన ప్రతి గ్రూపు సభ్యులు వాటిని సక్రమ పద్ధతిలో వినియోగించుకుని జీవనోపాధులు మెరుగు పరచుకోవాలన్నారు. ఎస్‌హెచ్‌జీ సభ్యులు కోసం ప్రభుత్వం అనేక పథకాలు ప్రవేశ పెట్టిందని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రతి మహిళను లక్షాధికారులను చేయడమే సీఎం జగనన్న లక్ష్యం అన్నారు. కార్యక్రమంలో ఏసీ రఘునాథరెడ్డి, ఏపీఎం అపర్ణ, సీసీలు, వీఓఏలు పాల్గొన్నారు.

ఆ ముగ్గురు.. దేశాభివృద్ధి నిర్మాతలు

- అంబేడ్కర్, పూలే, జగజ్జీవన్‌రామ్‌లపై ప్రత్యేక సదస్సులో వీసీ

వైవీయూ : భారతదేశ అభివృద్ధికి, సంస్కరణలకు బాటలు వేసిన గొప్ప సంఘసంస్కర్తలు, నిర్మాతలు డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్, జ్యోతిరావుపూలే, బాబూ జగజ్జీవన్‌రామ్‌లు అని వైవీయూ వీసీ జింక రంగజనార్ధన పేర్కొన్నారు. వైవీయూలోని ఆర్ట్స్‌అండ్ హ్యుమానిటీస్ బ్లాక్‌లోని సురభి సమావేశ మందిరంలో అంబేడ్కర్, జ్యోతిరావుపూలే, బాబూజగజ్జీవన్‌రామ్‌ల జయంతి వేడుకలను ప్రత్యేక సదస్సు సమాన అవకాశాల డైరెక్టర్ డా. ఎం.ఎం. వినోదిని ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ముగ్గురు మహనీయులకు అధికారులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ భారతీయులకు ఏప్రిల్ మాసం ఒక పండుగలాంటిదన్నారు. అట్టడుగువర్గాల అభ్యున్నతికి కృషిచేసిన ముగ్గురు మహనీయుల జయంతోత్సవాలు ఒకే నెలలో రావడం విశేషమన్నారు. 50 సంవత్సరాల క్రితమే మహిళల విద్య ఆవశ్యకతను గుర్తించి బాలికల విద్యను ఏర్పాటు చేసిన పూలే చిరస్మరణీయులన్నారు. రిజిస్ట్రార్ ఆచార్య వై.పి.వెంకటసుబ్బయ్య మాట్లాడుతూ పూలే, అంబేడ్కర్, జగజ్జీవన్ రామ్ బడుగు, బలహీన వర్గాల్లో చైతన్యం తీసుకువచ్చిన గొప్ప సంస్కర్తలు అని కొనియాడారు. ప్రిన్సిపాల్ ఆచార్య కె. కృష్ణారెడ్డి , శాతవాహన విశ్వవిద్యాలయం డైరెక్టర్ ఆఫ్ అడ్మిషన్స్ సూరేపల్లి సుజాత ఉన్నారు.

వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందు

జమ్మలమడుగు : పట్టణంలోని ఆస్థానయేగొసియా మసీదులోని ముస్లింలకు వైఎస్సార్‌సీపీ నాయకులు గురువారం ఇఫ్తార్ విందును ఏర్పాటు చేశారు. వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు పోరెడ్డి మహేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, హజ్‌కమిటీ చైర్మన్ బి.గౌస్‌లాజం ముస్లింలకు విందును వడ్డించారు. అనంతరం పీఠాధిపతి, గెజిటెడ్ ప్రభుత్వ ఖాజీ సయ్యద్‌షా గౌస్‌పీరాఖాద్రీలు మాట్లాడారు. మున్సిపల్ వైస్ చైర్మన్ సింగరయ్య, మార్బల్ శ్రీను, బుజ్జి, ఆస్థానయే కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ప్రారంభమైన అంకాలమ్మ తిరునాల




ప్రత్యేక అలంకరణలో అంకాలమ్మ

సింహాద్రిపురం : మండలంలోని అంకాలమ్మగూడూరులో వెలసిన అంకాలమ్మతల్లి తిరునాల గురువారం ప్రారంభమైంది. అమ్మవారిని ప్రత్యేక అలంకరణ చేసి పూజలు నిర్వహించారు. భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం గ్రామాల సుభిక్షం కోసం సిరిబండిని గ్రామం చుట్టూ తిప్పారు. ఆదివారం ఎద్దుల బండలాగుడు పోటీలు నిర్వహించనున్నట్లు ఆలయ చైర్మన్ అశోక్‌రెడ్డి తెలిపారు. పోటీలలో గెలుపొందిన ఎద్దులకు తొమ్మిది బహుమతులను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఇందులో రూ.90వేలు మొదటి బహుమతిని ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి ప్రధానం చేశారని, రూ.80వేలు రెండవ బహుమతి వైఎస్సార్‌సీపీ మండల నాయకుడు శ్రీకాంత్‌రెడ్డి, రూ.70వేలు మూడవ బహుమతిని ఆలయ చైర్మన్ అశోక్‌రెడ్డి, రూ.60వేలు నాలుగో బహుమతిని వైఎస్సార్‌సీపీ నాయకుడు హరినాథరెడ్డిలు ప్రదానం చేస్తారని ఆయన తెలిపారు. పోటీలలో పాల్గొన్న వారికి రూ.5వేల కన్సలేషన్ బహుమతి ఇవ్వనున్నట్లు ఆయన తెలిపారు.

భూసార పరీక్షల వల్ల అధిక మేలు

చెన్నూరు : రైతులు భూసార పరీక్షలు చేయించుకుంటే అధిక మేలు చేకూరుతుందని కేవీకే శాస్త్రవేత్త డాక్టర్ టి.స్వామి చైతన్య తెలిపారు. గురువారం స్థానిక రైతు భరోసా కేంద్రం చెన్నూరు–2లో భూసార పరీక్ష, నేల పరిస్థితిపై మండల స్థాయిలో వ్యవసాయ సిబ్బందికి ఆయన వర్క్‌షాప్ నిర్వహించి మాట్లాడారు. మట్టి నమూనా తీసే విధానం గురించి తెలిపారు. ఎకరానికి 8 చోట్ల మట్టి నమూనా సేకరించాలని, వరి తదితర పంటలకు 15 సెంటీమీటర్లు లోతు వరకు, పత్తి, వాణిజ్య పంటలకు 30 సెంటీమీటర్లు లోతు వరకు, పండ్ల తోటలకు ఒకటి లేదా రెండు మీటర్ల లోతు వరకు మట్టి నమూనా సేకరించి పరీక్షకు పంపించాలని సూచించారు. అంతేకాకుండా నీటి పరీక్షకు బోరు నుంచి నీటిని సేకరించి అదేరోజు పరీక్షకు పంపించాలన్నారు. రైతు శిక్షణ కేంద్రం డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ అగ్రికల్చర్ మాట్లాడుతూ పచ్చిరొట్ట ఎరువుల వల్ల భూమికి కలిగే ప్రయోజనాలు తెలియజేశారు. కార్యక్రమంలో రైతుశిక్షణ కేంద్రం అధికారి పద్మజ, మండల వ్యవసాయాధికారి శ్రీదేవి, ఆర్బీకేల ఇన్‌చార్జిలు పాల్గొన్నారు.

వేసవిలో పశువులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలి



మందులను పంపిణీ చేస్తున్న దృశ్యం

జమ్మలమడుగు : వేసవి కాలంలో పశువులకు సంక్రమించే వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని పశు సంవర్ధకశాఖ జిల్లా అధికారి డాక్టర్ రమేష్ తెలిపారు. గురువారం మండల పరిధిలోని పి.బొమ్మెపల్లి గ్రామంలో ఏడీ వెంకటరామిరెడ్డి ఆధ్వర్యంలో రైతులకు పశుసంరక్షణ, దూడల పెంపకం తదితర అంశాలపై అవగాహన సదస్సును నిర్వహించారు. అనంతరం రైతులు పశువులకు సంబంధించిన వ్యాధినిరోధక కిట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ రామనాథ్‌రెడ్డి, డాక్టర్ జాన్‌సుధాకర్, శివరామిరెడ్డి, చిరంజీవి, రాఘవేంద్ర తదితరులు పాల్గొన్నారు.

గోవులను గోశాలకు తరలించాలి

కడప కార్పొరేషన్: కడపనగరంలో వివిధ ప్రాంతాల్లోని గోవులన్నింటినీ వారం రోజుల్లోగా గోశాలకు తరలించాలని మున్సిపల్ కమిషనర్ ఎస్ఎస్ ప్రవీణ్‌చంద్ ఆదేశించారు. గురువారం మార్నింగ్ విజిట్‌లో భాగంగా ఆయన పాత మార్కెట్, మాచుపల్లి బస్టాండు, జయనగర్ కాలనీ ప్రాంతాల్లో పర్యటించారు. పాత మార్కెట్‌లో ఉన్న రూములను తనిఖీ చేసి, కార్పొరేషన్‌కు సంబంధించిన స్థలాలను గుర్తించి కొలతలు వేయాలని సూచించారు. ప్రతి షాపునకు ఆస్తి పన్ను వేయాలని ఆదేశించారు.